వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 11 మార్చి 2023

# గెలిచేది రూపాయి డాక్టరే

(డాక్టర్ చామల అనీల్ వెంకటప్రసాద్ రెడ్డి)

**కడప, మార్చి 10 ప్రభాతవార్త :** ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో డాక్టర్ చామల అనీల్ వెంకటప్రసాద్‌రెడ్డి(రూపాయి డాక్టర్) విజయం సాధిస్తారని నంద్యాలలో ఏర్పాటుచేసిప ప్రచార సభలో పలువురు ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం జరిగిన ఈ సభలో వారు మాట్లాడుతూ కోట్ల రూపాయల జీతం విలాస వంతమైన జీవితం, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఐక్య రాజ్యసమితి, మసాచుసెట్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి లాంటి సంస్థల నుంచి అవార్డులు, బిల్‌క్లింటన్, ఇంద్రానూయి, రవూల్‌రేఫ్, ఎంఐటీ డైరెక్టర్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులతో పరిచయాలు ఇవన్నీకూడా ఆయన్ని స్వదేశానికి రాకుండా ఆపలేకపోయాయన్నారు. అందరూ ఇక్కడ చదివి విదేశాలకు వెల్తుంటే ఈయన మాత్రం ఇంగ్లాడులో చదివి తనవాళ్లకు ఉపయోగపడాలని,ఇక్కడికి వచ్చి రూపాయి డాక్టరుగా భరత్ సింగ్ జ్ఞాపకార్థం పేదల డాక్టరుగా మన్నన పొందారన్నారు. జీఓ 117 మీద కోర్టులో సంవత్సరం నుంచి డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం 25 వేల ప్రయివేటు టీచర్ల జీవితాలను నిలబెట్టాలని పోరాడుతున్న వ్యకి_్త అని, జిఓ 24 ద్వారా మరియు 10 సంల రెన్యూవల్‌ను 3 సంలు తగ్గించి ప్రయివేటు సంస్థల నడ్డివిరుస్తుంటే ధీటుగా ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వ్యక్తి అని అన్నారు.

# ప్రశాంత పోలింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి : కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి.మార్చి10 ప్రభాతవార్త



జిల్లాలో ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, రాజకీయ పార్టీ ఏజెంట్లకు ఒరిజనల్ ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ నేతలతో అన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్‌లలో వెబ్ కాస్టింగ్ మరియు వీడియోగ్రఫీ నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీలు సంయమనం పాటించాలని, ఎన్నికల సంఘం సూచనలను పాటించాలని ఆయన కోరారు. పోలింగ్ ప్రక్రియలో ఏవైనా సమస్యలుంటే తహశీల్దార్‌కు తెలియజేయాలని ఆయన కోరారు. ఎన్నికల కోసం భారత ఎన్నికల సంఘం పంపిన జంబో బ్యాలెట్ బాక్సులు గురించి పార్టీలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ నేతలు హాజరయ్యారు.




# కుక్కలదాడిలో మృతి చెందిన జింక



గాయపడిన జింక, గాయపడిన జింకకు పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం

**రామసముద్రం, మార్చి 10 ప్రభాతవార్త :**

మండలంలోని కాప్పల్లి పంచాయితీ బైరాజుపల్లి గ్రామ సమీపాన శుక్రవారం మేతకోసం పంటపొలాల్లోకి వచ్చిన జింక పిల్లను గ్రామానికి చెందిన కుక్కలు వెంబందించి జింకపై దాడిచేశాయి. దీన్ని గమనించిన గ్రామస్థులు కుక్కలను తరిమి జింకను కాపాడారు. ఫారెస్టు అధికారులకు గ్రామస్థులు సమాచారం అందివ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్సలు చేస్తుండగా జింకపిల్ల మృతి చెందింది. జింకపిల్లకు పంచనామా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ శ్రీదేవి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ కిరన్, మంజు తదితరులు పాల్గొన్నారు.

**నిష్పక్షపాతంగా వ్యవహరించాలి**

కడప మేయర్ కె.సురేష్‌బాబు

IV లో

# అడుగు అడుగున అదే అభిమానం : యం.వి.కి పెరుగుతున్న ఆదరణ



నంద్యాలలో ఎం.వి. రామచంద్రారెడ్డి అభ్యర్థిత్వాన్ని బలపరస్తూ మాట్లాడుతున్న నంద్యాల ఎమ్మెల్యే రవిచంద్రకిషోర్

**కడప, మార్చి 10 ప్రభాతవార్త :** పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో యం.వి రామచంద్రారెడ్డికి రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. అపుస్మా నేతగా 36 ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలో దిగిన **ఎం.వి రామచంద్రారెడ్డి**కి బడి బడిలోన ఉపాధ్యాయ వర్గం స్వాగతం పలుకుతోంది. **ఎం.వి** ప్రచారానికి వస్తున్నారని తెలియగానే ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయ వర్గాలు **ఎం.వి**కి దన్నుగా నిలుస్తున్నాయి. పల్లె పట్నం తేడా లేకుండా ఉపాధ్యాయ వర్గాలలో **ఎం.వి.** గెలుపు తథ్యం అంటూ స్వచ్ఛందంగా ఉపాధ్యాయులు **ఎం.వి రామచంద్రారెడ్డి**కి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇన్నాళ్లు ఉద్యమ నాయకుల ఊకదంపుడు ఉపన్యాసాలతో కాలయాపన తప్ప తమ సమస్యల పరిష్కారం కాదన్న చేదు నిజాన్ని గ్రహించిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పెద్దలతోనూ అధికార గణంతోనూ అత్యంత సఖ్యతగా ఉండే **ఎం.వి** ని గెలిపించుకుంటే తమ సమస్యల పరిష్కారానికి మార్గం సుగుమమవుతుందని ఉపాధ్యాయ లోకం మొత్తం భావిస్తోంది.. ఇన్నాళ్లసంఘాల ముసుగులో కొందరు నేతలు చేసిన ఆర్భాటపు ప్రకటనలతో విసుగు చెందిన ఉపాధ్యాయ వర్గాలు **ఎం.వి** వైపు మరలడానికి కారణం అవుతున్నాయి.. కరోనా కాలంలోనూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య హక్కుల పైన చేసిన పోరాట ఫలితాలు **ఎం.వి రామచంద్రారెడ్డి** విజయానికి బాటలు వేస్తున్నాయి.. యంవి రామచంద్రారెడ్డి లాంటి పోరాట పటిమ నిగర్వి కార్యదీక్షపరుడు అయిన **ఎం.వి** వైపే మగ్గుచూపడం తమ భవితకు తామే బాటలు వేసుకున్నట్లు ఉపాధ్యాయ వర్గం భావిస్తోంది. దీంతో **ఎం.వి.** విజయం ఎన్నికల ముందే ఖరారు అయినట్లుగా వైరి వర్గం నేతలే అంతర్గత సమావేశాలలో ఒప్పుకుంటునట్లు అత్యంత సన్నిహితుల సమాచారం.. నిన్న మొన్నటి వరకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు రెండు మూడు యూనియన్లుగా ఉన్నప్పటికీ **ఎం.వి రామచంద్రారెడ్డి** కోసం యూనియన్లకు అతీతంగా వ్యక్తిగత అజెండాలను పక్కనపెట్టి తమ ప్రతినిధి అని యం.వి రామచంద్రారెడ్డి విజయానికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేటు ఉపాధ్యాయులు కార్యరంగంలో చురుకుగా కదులుతున్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్, పండిట్ ఉపాద్యాయ సంఘాలు , పిఈటిలు , మోడల్ స్కూల్ ఉపాద్యాయ వర్గాలు కూడా **ఎం.వి** కి బ్రహ్మరథం పడుతున్నారు.. ప్రచారంలో ప్రభుత్వ ప్రైవేటు ఉపాధ్యాయుల మద్దతు చూస్తుంటే **ఎం.వి** గెలుపు ఖాయం అన్నటువంటి సంకేతాలు ఉపాధ్యాయ వర్గాలలో వినిపిస్తున్నాయి.. ఎన్నికల తేదీ దగ్గర పడే కొద్ది **ఎం.వి రామచంద్రారెడ్డి** శిబిరంలో విజయం ధీమా పెరుగుతూ పోతోంది.

# మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తాం

## బహిరంగసభలో నారాలోకేష్





**మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :**

టిడిపి అధికారంలోకి రాగానే మదనపల్లె,తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు నాలుగు నియోజకవర్గాలను కలిపి మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ తెలిపారు. శుక్రవారం మదనపల్లె సమీపంలోని టికేఎం వెంచర్‌లో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఏ పథం ప్రారంభించిన అందులో ఎక్కువ అవినీతే ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో స్కీమ్‌లకంటే స్కామ్‌లే ఎక్కువుగా జరుగుతున్నాయని మాజీ మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ తెలిపారు. చంద్రబాబు పాలనలో సన్‌రైజ్ ఏపిగా ఉంటే జగన్ పాలనలో ఫినిష్ ఆంధ్రాగా ఉంటుందన్నారు. ముస్లింల కోసం ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేస్తామని, రాష్ట్రంలోనే టమోటా వ్యాపార లావాదేవీలకు పేరు పొందిన మార్కెట్‌యార్డును దత్తత తీసుకొని రైతులను అన్ని విధాల ఆదుకొంటామన్నారు. ఎంతో పవిత్రభూమిగా పేరుపొందిన మదనపల్లె స్వాతంత్ర్య ఉద్యమాలకు పుట్టిన గడ్డ అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహత్మగాంధీ మదనపల్లెకు వచ్చినపుడు భారీగా విరాళాలు ఇచ్చి గొప్ప మనసును చాటుకొన్నారన్నారు. బ్రిటీష్‌వాళ్ళను తరిమికట్టేలా బిటి కళాశాల విద్యార్థులు ముందుకు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారన్నారు. జాతీయ గీతమైన జనగణమనను విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఇదే మదనపల్లెలోని బెంగాళి నుంచి ఆంగ్లంలోకి అనువధించారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం మదనపల్లెను నిర్లక్ష్యం చేస్తూ ఈ ప్రాంత ప్రజలను అవమానపరుస్తున్నారన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపి, మంత్రి ఉండికూడా పట్టణానికి అన్యాయం చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం ఇసుక, మట్టి, భూకబ్జాలు, అక్రమ క్వారీల పేరుతో వేలకోట్లు దోచుకొంటున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే వక్ప్ బోర్డు ఆస్థులకు సంబంధించి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమాల్లో ఎంపి, ఎమ్మెల్యే, మంత్రులు భాగస్వామ్యం అని తెలిపారు. బాహుదా ప్రాజెక్టు నుంచి రోజుకు 100ట్రిప్పర్లు అక్రమంగా తరలిస్తూ లక్షలాదిరుపాయలు దండుకొంటున్నారన్నారు. బిల్డప్ బాయ్‌గా జగన్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలు అన్ని కొనసాగిస్తామన్నారు. వైకాపా పాలనలో ఎస్‌సి, ఎస్‌టిలతో పాటు మైనార్టీలకు రక్షణ కరువైందన్నారు. వైకాపా దాడులు అరికట్టాలంటే టిడిపిని ఆదరించాలని కోరారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైకాపా అరాచకాలు ఎక్కువ అవుతున్నాయన్నారు. చంద్రబాబు పాలనలో ముస్లింలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో ఆడుకొంటున్నా రన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సంపూర్ణ మద్యపానం చేస్తామని చెప్పిన జగన్ దాని ఊసే ఎత్తడం లేదన్నారు. అనంతరం లోకేష్ సమక్షంలో మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో రాజంపేట ఎంపి అభ్యర్థి గం టానరహరి, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దొమ్మ లపాటి రమేష్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, మార్పూరి సుధాకర్‌నాయుడు, డిఆర్ తులసీప్రసాద్, ఎస్ఎ.మస్తాన్, భవానిప్రసాద్, మోడెం సిద్దప్ప, ఎస్ఎం.రఫి, మా జీ కౌన్సిలర్లు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**పాదయాత్రలో లోకేష్‌కు మదనపల్లెలో గజమాలలతోస్వాగతం**

మదనపల్లెలో శుక్రవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో పట్టణంలోని పలువురు గజమాలతో స్వాగతించారు. టౌన్‌బ్యాంకు సర్కిల్ వద్ద కౌన్సిలర్ తులసీరామక్రిష్ణ భారీ గజమాలతో స్వాగతించారు. అదే విధంగా తాజ్‌హోటల్ వద్ద మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ పెద్దఎత్తున బాణసంచాపేల్చి గజమాలతో స్వాగతించారు. హోటల్ వద్ద లోకేష్‌తో సెల్ఫీ ఫోటోలు దిగారు. బెంగుళూరు బస్టాండు, మల్లికార్జునసర్కిల్ వద్ద పూలమాలలతో టిడిపి నాయకులు స్వాగతించారు. నీరుగట్టువారిపల్లెలో తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు పెద్దఎత్తున బాణసంచాపేల్చి చేనేత కార్మికులతో కలసి గజమాలతో లోకేష్‌ను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, నాయకులు ఎస్ఎ.మస్తాన్, బోడిపాటి శ్రీనివాసు, డిఆర్.తులసీప్రసాద్, ఆర్‌జె.వెంకటేష్, మోడెం సిద్దప్ప, భవానిప్రసాద్, దొరస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో రీపోలింగ్‌కు అవకాశమివ్వరాదు

-ఎమ్మెల్సీ ఎన్నికలలో సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాలి

-జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్





**రాయచోటి, మార్చి10 ప్రభాతవార్త**

ఈనెల 13వ తేదీన జరిగే పట్టభద్రులు, ఉపాద్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సెక్ట్రోరల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రీపోలింగ్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తగా పోలింగ్ సరళి జరిగేటట్టు చూడాలన్నారు. సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంప్, వీల్ చైర్స్, విద్యుత్, తాగునీరు, వెబ్ క్యాస్టింగ్ చేయుటకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలు ఉండేటట్లు చూడాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్‌లకు వరకు మార్కింగ్ చేయాలని, పోలింగ్ కేం ద్రంలోనికి సెల్‌ఫోన్స్, టీ, కాఫీ, వాటర్ బాటల్స్, పెన్‌లు, అగ్గి పెట్టెలు తీసుకెళ్లరాదన్నారు. పివో ఇచ్చిన పెన్‌తోనే ఓటరుఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం వివరాలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి గొడవలు రాకుండా పోలీస్ బందోబస్తుతో సమన్వయంతో చేసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తినట్లయితే ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్‌లు జాగ్రత్తగా సేవ్ చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరు సీరియస్‌గా తీసుకుని రీపోలింగ్‌కు అవకాశం లేకుండా పోలింగ్ సరళి విజయవంతం చేసి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, రాయచోటి ఆర్డివో రంగస్వామి, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రికి రహదారి ఏది?

**ఆసుపత్రి నిర్మాణానికి కోట్ల రూపాయలు ఖర్చు - త్వరలో డయాలసిస్ కేంద్రం ప్రారంభం**

**నియోజకవర్గంలోనే పెద్ద ఆసుపత్రిగా పేరు - ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం**

**రహదారికి నోచుకోని ఆసుపత్రి**



రహదారి లేని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి.

**బద్వేలు, మార్చి 10 ప్రభాతవార్త :**

బద్వేలు ప్రభుత్వ సీమాంక్ ఆసుపత్రి నూతన నిర్మాణం కోసం కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేస్తున్నారు. ఒక పక్క కొత్త ఆసుపత్రి, మరో పక్క డయాలసిస్ కేంద్రం ప్రారంభానికి సిద్ధం. ఇలా అన్ని రకాల వసతులు, హంగులతో డివిజన్ స్థాయిలో ఉండవలసిన ఆసుపత్రి ఏ విధంగా ఉండాలో అలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంత చేస్తున్నా పెద్ద లోటు కనపడుతుంది. ప్రభుత్వ ఆసుపత్రికి అసలు దారేది? ఎక్కడి నుండి వెళ్ళాలి? అత్యవసరమైతే పరిస్థితి ఏమిటి? ఇది గత కొన్నేళ్లుగా ప్రజలను వేధిస్తున్న సమస్య. కానీ అధికారులు మాటలు చెప్పి కాలయాపన చేసి సరైన సూచనలు లేకుండా ఆసుపత్రికి రహదారిపై సమాలోచనలు చేయకుండా తూతూ మంత్రంగా తనిఖీలు, పరిశీలనలు చేసి వెళుతున్నారే తప్ప, ఇంత ఆసుపత్రికి ఎక్కడి నుండి రహదారి ఏర్పాటు చేయాలనే ఆలోచనపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని బద్వేలు ప్రజలు మండి పడుతున్నారు. గతంలో మంత్రులు, కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇంత మంది ప్రజా ప్రతినిధులు, అధికారుల బృంధం ఆసుపత్రిని పరిశీలించి రహదారిపై చర్చించి త్వరలో ఆసుపత్రికి రహదారి ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చారు. తరువాత రోజులు గడుస్తున్నా వాటి గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యారు. అధికారులు కూడా చూశాము, బదిలీపై వెళ్ళాము అనే ధోరణి తప్ప ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో ఆసుపత్రికి ప్రధాన రహదారిని ఏ విధంగా ఏర్పాటు చేయాలి అనేదానిపై ఆలోచించిన పాపాన పోలేదు. మెయిన్ రోడ్డు నుండి 100 మీటర్ల లోపలే ప్రభుత్వ ఆసుపత్రి కనపడుతుంది. కానీ ఆసుపత్రికి వెళ్ళాలంటే చుట్టూ తిరిగి వెళ్ళాల్సిన దుస్థితి. అత్యవసరమైతే సందులలో వాహనాలు వెళ్ళాలంటే చాలా ఇబ్బందిగా మారుతుంది. ఇరుకైన రహదారి గుండా ఆసుపత్రికి వెళ్ళాలి తప్ప, ఇంత ఆసుపత్రికి ఎంత పెద్ద రహదారి ఉండాలనే దానిపై గతంలో చర్చించినా తరువాత కనుమరుగై పోయింది. రాజకీయ నాయకులు కూడా మాకెందుకులే అని వదిలేశారు తప్ప రహదారిపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టక పోగా ఇంత ఆసుపత్రికి రోజుకు 500 మంది పైగా రోగులు వస్తుండడమేగాక రాబోయే రోజులలో సేవలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎందుకు ఆసుపత్రి రహదారిపై నిర్లక్ష్యం వహిస్తున్నారని చర్చనీయాంశంగా మారింది. రాత్రి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఇళ్ళ మధ్య నుండి ఆసుపత్రికి వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ఎక్కడా లేని దయనీయమైన పరిస్థితి బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి ఏర్పడింది. ఆసుపత్రి నిర్మాణం వేగంగా జరుగుతున్నా, కోట్ల రూపాయల వ్యయంతో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నా, అన్ని వసతులతో రోగులకు సరైన సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమవుతున్నా, ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రధాన రహదారి అనేది ఎప్పటి నుండో వస్తున్న సమస్య. ఆలోచిత నిర్ణయమో, అనాలోచిత నిర్ణయమో ఆనాడు కోట వీధిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కుంటలో ఏర్పాటు చేసేటపుడు ఈ ఆసుపత్రికి రహదారి పరిస్థితి ఏమిటని ఆ రోజు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆలోచన చేయలేదు. కాంట్రాక్టర్ల లబ్ధి కోసం ఆసుపత్రిని తరలించి వేగంగా నిర్మించారే తప్ప, దీనికి ప్రధానమైన రహదారిపై చర్చించిన దాఖలాలు లేవు. ఈ రోజు బద్వేలు మండల స్థాయి నుండి మున్సిపాలిటీ స్థాయి, మున్సిపాలిటీ నుండి డివిజన్ స్థాయికి చేరిన నేపథ్యంలో రాబోవు రోజులలో బద్వేలు బస్తీ అవుతున్న దృష్ట్యా జనాభా పెరిగి అందుకు తగ్గట్లుగా సౌకర్యాలు పెరుగుతుంటే ఆసుపత్రికి రహదారే లేకపోతే భవిష్యత్తులో ఎలా ఉంటుంది. ఎన్నేళ్లు అయినా సందులలో నుండే అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు, ప్రజలు ఆసుపత్రికి వెళ్ళవలసిన పరిస్థితేనా? ఎవరైనా మార్పులు చేస్తారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

# ఎన్నికల్లో పోలింగు పక్రియ అత్యంత కీలకమైనది

ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి



**కడప, మార్చి 10 ప్రభాతవార్త :**

శాసన మండలి ఎన్నికలలో పోలింగు ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలన, అవగాహనతో చేపట్టాలని.. కడప రెవెన్యూ డివిజనల్ అధికారి ధర్మచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సభా భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించడానికి నియమించిన 400 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు.. మూడు షెషన్లలో ఆర్డీఓ ధర్మ చంద్రారెడ్డి అధ్యక్షతన ఒక రోజు డెమో బ్యాలెట్ బాక్సులు, పత్రాలు, పిపిటి ద్వారా శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈనెల 13వ తేదీన జరుగనున్న పట్టబద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పోలింగ్ నేపథ్యంలో 38 ఎమ్మెల్సీ టీచర్ పోలింగ్ కేంద్రాలు, 93 పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిపేందుకు కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశాల మేరకు 400 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డెమో బ్యాలెట్ బాక్సులు, డెమో బ్యాలెట్ పేపర్లను అధికారులకు చూపిస్తూ వాటి నిర్వహణ ఎలా చేపట్టాలనే అంశాలను పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించడం ద్వారా.. పోలింగ్ ప్రక్రియలో విధులు నిర్వర్తించే వారికి ఎంతో ఉపయుక్తం అన్నారు.పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరిగేలా చూడాలలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో వెంకట రమణ, జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి దీప్తి, శిక్షణా ఆర్డీవోలు, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ విజయ్‌రామరాజు



**కడప, మార్చి 10 ప్రభాతవార్త :**

పదవ తరగతి పరీక్షలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని.. జిల్లా కలెక్టర్ వి. విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీసీ హాలులో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం.. మండల విద్యాశాఖ అధికారులతో పాటు రెవెన్యూ, పోలీసు, మెడికల్, రవాణా శాఖల అధికారులతో కలెక్టర్ వి. విజయ్ రామరాజు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు మాట్లాడుతూ.. వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 28,380 మంది విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఈ పబ్లిక్ పరీక్షలు మూడవ తేదీ నుండి 18వ తేదీ వరకు 146 పరీక్ష కేంద్రాలలో జరగనున్నాయని తెలిపారు. ఈ సంవత్సరం జరిగే పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్న పత్రావళిలో ఏడు అంకెలతో కూడిన సీరియల్ నెంబర్‌ను ముద్రించి ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో ఆ ప్రశ్న పత్రం ఆ పరీక్ష కేంద్రంలోని ప్రతి విద్యార్థికి ఇచ్చే ప్రశ్నాపత్రాలు ఏ పరీక్షా కేంద్రానికి ఇవ్వడం జరిగింది అదే విధంగా ఏ విద్యార్థికి ఇవ్వడం జరిగింది అనేది తెలుస్తుందన్నారు. పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్, ఎగ్జామినేషన్ ఇన్విజిలేటర్.. ఏ ఒక్కరికీ కూడా పరీక్ష కేంద్రంలో మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని తెలిపారు. అదేవిధంగా ఆ పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, టాయిలెట్స్, త్రాగునీరు, ఫ్యాన్లు,లైట్లు వెంటిలేషన్ అన్నీ సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి దేవరాజు, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఏ. ప్రభాకర్ రెడ్డి, అన్ని మండలాల ఎం.ఈ.ఓ.లు, ప్రధానోపాధ్యాయులు, పోలీసు, రెవెన్యూ, మెడికల్, ట్రెజరీ, ఆర్టీసీ, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు అన్ని రంగాలలో రాణించాలి**

-జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్

IV లో

## డిఏ బకాయిలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి

### పెన్షనర్స్ సంఘం యూనియన్ అధ్యక్షులు మీనాక్షి రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం.

బద్వేలు అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం కడప జిల్లా బద్వేలు యూనిట్ ఆధ్వర్యంలో ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బకాయిలు, డిఏ బకాయిలు సకాలంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పెన్షనర్స్ సంఘం బద్వేలు యూనిట్ అధ్యక్షులు డా॥ మీనాక్షి రెడ్డి ఆధ్వర్యంలో రా ష్ట్ర పెన్షనర్స్ సంఘం అసోషియేషన్ పిలుపు మేరకు బద్వేలు శాసన సభ్యురాలుకు శుక్రవారం వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మీనాక్షిరెడ్డి మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు అనారోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు అధికంగా ఉన్నాయని, 1వ తారీఖున పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే ద్వారా తెలియజేయాలని వారికి వినతిపత్రం అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మీనాక్షిరెడ్డితో పాటు కార్యదర్శి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, అసోషియేషన్ అధ్యక్షులు పుల్లయ్య, ఆర్గనైజేషన్ కార్యదర్శి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు ఆనందరావు, ప్రసాద్, రామసుబ్బారెడ్డితో పాటు పలువురు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించడం జరిగింది.

## నిరాశ్రయులకు చేయూత



కూలర్, మిక్సీ వితరణ చేస్తున్న దృశ్యం

బద్వేలు రూరల్, మార్చి 10 ప్రభాతవార్త :

మానవతా సేవా దృక్పథంతో శుక్రవారం పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల ఆశ్రమాన్ని కీ॥శే॥ డా॥ సింగమల మల్లెం కొండారెడ్డి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని శ్రీదేవి, కుమార్తె పావని, కుమారుడు కార్తీక్ రెడ్డిల ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు సందర్శించి, అక్కడ ఉన్న అనాథ వృద్ధుల బాగోగులు అడిగి తెలుసుకొని రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన కూలర్ మరియు మిక్సీని వితరణ చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన తెలుగు గంగ ప్రాజెక్టు సీనియర్ అసిస్టెంట్ సరోజని, బత్తల పల్లె రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ మా సోదరుడైన కీ॥శే॥ డా॥ సింగమల మల్లెం కొండారెడ్డి సేవలు మరువలేనివని, వారి ఆకస్మిక మరణం మా కుటుంబానికి తీరని లోటు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారి పేరు మీద ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు చేయాలని తలపెట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, సంఘ సేవకులు పిడతల రవి కుమార్‌తో పాటు ఆనంద నిలయం నిరాశ్రయుల వసతిగృహ సిబ్బంది కన్నయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభిమానుల మధ్య మండల కన్వీనర్ చెవ్వు జన్మదిన వేడుకలు



చిట్వేలి, మార్చి 10 ప్రభాతవార్త

వైసిపి శ్రేణులు, అభిమానుల మధ్య శుక్రవారం ఉదయం ఎంపిడిఒ ప్రాంగణంలో వైసిపి మండల కన్వీనర్ ఉప ఎంపిపి చెవ్వు శ్రీనివాసులురెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. భారీకేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలమాల, శాలువాలతో అభిమానులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, డిసిసి బ్యాంకు సింగిల్‌విండో ప్రెసిడెంట్ డి.ప్రదీప్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మలిశెట్టి వెంకటరమణ, వైసిపి నాయకులు మేక జయరాంరెడ్డి, రమణారెడ్డి తదితరులు మాట్లాడుతూ చెవ్వు శ్రీనివాసులురెడ్డి కుటుంబం దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి అత్యంత అభిమానం చాటిందని, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కూడా విడవకుండా పార్టీ పటిష్టం కోసం తాను సైనికుడిలా పోరాడారని ఆయననను అభినందించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో తనకున్న పరిచయాలతో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని వారు అన్నారు. తదుపరి ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంచిపెట్టారు. మధ్యాహ్నం అభిమానులు పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి వెంకటరెడ్డి, మోచర్ల నరసింహ, పంట హరినాథ్, మోసాటి రాముడు, లింగం లక్ష్మీకర్, యూత్ కన్వీనర్ నవీన్, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, ఎం.కనకరాజు, మల్లి, మంద నాగేశ్వర, పార్టీ అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిభాయి పూలే

బద్వేలు అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త :



సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం.

పట్టణంలోని పూలే సర్కిల్ వద్ద సావిత్రిభాయి పూలే విగ్రహానికి 126వ వర్ధంతి సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూలే ఆశయ సాధన సమితి ఛైర్మెన్ గురుమూర్తి మాట్లాడుతూ మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం మాతా సావిత్రిభాయి పూలే అని, జనవరి 3, 1831 లో మహారాష్ట్రలోని సతారా జిల్లా నయగావ్ గ్రామంలో జన్మించి చిన్న వయసులోనే జ్యోతిరావు పూలేను వివాహమాడి కుల, లింగ వర్గాల, వివక్షతకు వ్యతిరేకంగా భర్తతో కలిసి ఉద్యమించారని, స్త్రీ నిరక్షరాస్యతను రూపుమాపడానికై భర్త వద్ద విద్య నేర్చుకొని 1848న పూణేలో శూద్ర బాలికల పాఠశాలల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించి ఆ పాఠశాలలోనే ఉపాధ్యాయురాలుగా పనిచేసి భారత ప్రప్రథమ ఉపాధ్యాయినిగా పేరుగాంచారన్నారు.ఎన్నో రచనలు చేసి రచయిత్రిగా 1896-97 లో మహారాష్ట్రలో వచ్చిన భయంకరమైన ప్లేగు వ్యాధిలో రోగులకు సేవ చేస్తూ ఆ వ్యాధి సోకి మార్చి 10, 1897లో తుది శ్వాస విడిచారన్నారు. వారి ఆశయ సాధనకు మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గోపాలస్వామితో పాటు పూలే విగ్రహ నిర్మాణ కమిటీ వైస్ ఛైర్మెన్ వెంకటస్వామి, అన్వర్ బాష, ఆవాజ్ కమిటీ నాయకులు ఎస్.ఏ.సత్తార్, అనిల్ కుమార్ రాజు, చిన్న సుబ్బయ్య, జయరాములు, రామాంజనేయులు, రాజగోపాల్, ఖాజాగౌస్, మహీర్, నాగూర్, షబ్బీర్, మహబూబ్ సాహెబ్, నాగరాజ, లక్షుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి అడ్డదారుల్లో గెలవాలని ప్రయత్నిస్తోంది

### -మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి



రాయచోటి, మార్చి10 ప్రభాతవార్త

ప్రస్తుతం జరిగే పట్టభద్రుల ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపి అడ్డదారుల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నట్లు రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం రాయచోటి పట్టణం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్‌ల ద్వారా పట్టబద్రుల ఓటర్లుకు డబ్బులు పంపిణీ చేయడానికి కొన్ని చోట్ల పంపిణీ చేయడం జరిగిందని అలాగే ప్రవేట్ పాఠశాలలకు వెళ్లి అక్కడ హెడ్‌మాస్టర్‌లను అధకార పార్టీ నాయకులు బెదిరించి పట్టభద్రుల ఓట్లు వేయాలని వారికి కూడా డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన ఆరోపించారు. ఉపాధ్యాయులకు ప్రలోభాలకు లొంగదీయడానికి పలు రకాల ప్రయత్నాలు అధికార పార్టీ చేస్తోందని రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బోగస్ ఓట్లు ద్వారా గెలవాలని ప్రయత్నిస్తే బోగస్ ఓటర్లుపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాలంటీర్లు ఎన్నికల విధుల్లో ఎక్కడా పాల్గొనవద్దని ఎన్నికల కమీషన్ స్పష్టంగా ఆదేశించినా వాలంటీర్లు మున్సిపల్ కౌన్సిలర్‌లను వెంటబెట్టుకుని పట్టబద్రుల ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఓటర్లు మాత్రం తెలుగుదేశం పార్టీకి వేయడానికి సిద్దమయినట్లు రమేష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. విలేకరుల సమావేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాజులఖాదర్‌బాష, మురికినాటి వెంకటసుబ్బారెడ్డి తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూతులను తనిఖీ చేసిన తహశీల్దార్

కమలాపురం, మార్చి 10, ప్రభాతవార్త:



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులను శుక్రవారం కమలాపురం తహశీల్దార్ నారాయణరెడ్డి తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రం, ఐసీడీఎస్ కార్యాలయంలో రెండు ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన గదు లలో పోలింగ్ బూతులను ఎంఆర్‌వో నారాయణరెడ్డి పరిసరాలను పరిశీలిస్తూ మంచి నీటి సరఫరా, టాయిలెట్స్, విద్యుత్తు మొదలైన సౌకర్యాలను పరిశీలించి మాట్లాడుతూ ఈనెల 13న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరుగకుండా భద్రతాపరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం

మార్చి 13న నిర్వహించనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారు తుది జాబితాను సిద్ధం చేసిన రెవెన్యూ అధికారులు బిజీగా ఉన్నారు. శుక్రవారం తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో 59 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా పట్టభద్రుల ఓటర్లు 1798 మంది ఉన్నట్లు ఎమ్మార్వో నారాయణరెడ్డి తెలిపారు.

## జేఎన్‌టియు కళాశాల వార్షికోత్సవం

కలికిరి, మార్చి 10 ప్రభాతవార్త:



కలికిరి జేఎన్‌టియు కళాశాలలో శుక్రవారం కళాశాల దశాబ్ద వార్షికోత్సవ ఉత్సవాలు ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్య నారాయణ అట్టహాసంగా ప్రారంభించారు. ఈసందర్భంగా కళాశాలనుంచి క్రాస్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. మధ్యా హ్నం కళాశాలోని ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ దినోత్సవ కార్యక్రమం నిర్వహిం చడంతో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల వారికోత్సవాలు సందర్భంగా పదిరోజులు పాటు రోజూ ఒక కార్యక్రమాన్ని నిర్వహించి 18న కళాశాల యానివర్శిటిడే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుభాష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ అపర్ణ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఆధునిక దేశ చరిత్రలో ధృవతార సావిత్రిబాయిపూలే

పీలేరు, మార్చి 10 ప్రభాతవార్తః



ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తిరుపతిరోడ్డులో గల ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణ లో చదువుల తల్లి సావిత్రీబాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల హెచ్ఎం మహబూబ్‌బాషా , మహిళా ఉపాధ్యాయబందం సునీత, రేవతి, కళ్యాణి, సుభాషిణి, ప్రజా సంఘాల నాయకులు మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ బాస్ జిల్లా కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ భారత దేశంలో ప్రముఖ సంఘసంస్కర్తలలో భారతమాత సావిత్రీబాయి పూలే ఒకరు. ఆమె దేశంలో తొలి ఆదర్శ ఉపాధ్యాయుని బ్రిటీష్ పాలన నాటి ప్రజల స్థితి గతులు, విద్య, సాంఘిక దురాచారాలు, సతీసహగమనం, బాల్యవివాహాలు, సావిత్రీబాయిని కదిలించాయి. మహారాష్ట్రలో సతారా జిల్లాకు చెందిన నయ్‌గావ్ లో 1831వ సంవత్సరంలో సావి త్రీబాయ జన్మించింది. ఆమె కూడా బాల్య వివాహమే చదువుల తండ్రి జ్యోతీరావుపూలేతో జరిగింది. భారతమాత చదువుల తల్లి సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశ చరి త్రలో దవతారగా వెలుగొంది తూనే ఉంటుందని ఆమహాతల్లి వర్ధంతి యావద్భారతీయులు పురస్కరించుకుని ఘనమైన శ్రద్ధాంజలి ఘటించాలని తెలిపారు. ఈకార్య క్రమంలో మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగిరిమడుగు సుబాష్, మల్లికార్జున, మాల మహానాడు నాయకులు ప్రసాద్, విజయకుమార్, పాఠశాల సిబ్బంది విద్యార్థినిలు

## కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

కమలాపురం, మార్చి 10, ప్రభాతవార్త:



కమలాపురం మండలం పెద్దచెప్పలి సమీపంలో కోడి పందెం ఆడుతున్న ఆరు గురు వ్యక్తులను ఎస్సై చిన్నపెద్దయ్య తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1500 నగదు, 5 పం దెం కోళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## 14న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

రాయచోటి రూరల్, మార్చి 10, ప్రభాతవార్త:



మార్చి 14న రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ పెద్ద ఎత్తున జాతీయ నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శిబ్యాల ఆరోగ్య, ఉప కేంద్రం పరిధి లోని సిబ్బంది అల్బెండ జోల్ మాత్రలు పాఠశాలలో పంపిణీ చేశారు. కార్య క్రమంలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, ఏఎన్ఎంలు వి.సరస్వతి, అంజనమ్మ, ఎం.ఎల్.హెచ్.పి.శిరీష, ఆశా కార్యకర్తలు కె.రెడ్డమ్మ, ఎం.రమాదేవి, జ్యోతి, లత పాల్గొన్నారు. సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు వారికి అల్బెండజోల్ మాత్రలు మింగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులి పురుగుల మాత్రలు పంపిణీ చేశారు. పిల్లల్లో నులిపురుగులు, రక్తహీనత నివారణకు ఈ మాత్రలు తప్పని సరిగా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మధ్యా హ్నం భోజనం చేశాక ఒక మాత్రను ఒకసారి వేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు కూడా భాగస్వామ్యం కానున్నట్లు తెలిపారు.

## నులిపురుగులను నులిమేద్దాం

రాజుపాలెం, మార్చి 10, ప్రభాతవార్త:



మండల పరిషత్ కార్యాలయంలో యంపిడిఓ సయ్యద్‌హుస్నీషా ఆధ్వర్యంలోశుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు మంజుల మండల విద్యాశాఖ, అంగన్‌వాడి కార్యాలయ అధికారులకు, సిబ్బందికి నులి పురుగుల నిర్మూలణకు ఆల్‌బెండాజోల్ మాత్రలను అందించారు. ఈసందర్భంగా డాక్టరు మంజుల మాట్లాడుతూ మార్చి 14వ తారీకున జాతీయ నులిపురుగుల నిర్మాలన కార్యక్మంలో బాగంగా పాఠశాల,అంగన్‌వాడి పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేసి నులిపురుగులను నులిమేద్దాం అనే నినాదంతో ప్రభుత్వం చేపట్టే కార్యక్రమను విజయవంతం చేసి 1నుండి 19 సంవ్సరాలలోపు పిల్లల ఆరోగ్యంను కాపాడుదాం అని తెలిపారు. దీంట్లో బాగంగా అన్ని పాఠశాలలకు అందించుటకు నేడు విద్యాశాఖ అధికారులకు మాత్రలను పంపిణీ చేయటం అయినదని తెలిపారు.కార్యక్రమంలో ఆరోగ్య అధికారులు, సిబంది పాల్గోన్నారు.

## సావిత్రిబాయి పూలేకు నివాళి

ప్రొద్దుటూరు మార్చి 10, ప్రభాతవార్త



మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి, స్త్రీజాతి విముక్తి కోసం అహర్నిశలు శ్రమిం చి, ఆధునిక భారతదేశంలో కుల వ్యవస్థ నిర్మూలనకు, నిమ్నజాతి జాగృతి కోసం శ్రమించి అనేక అవమానా లను ఎదురొడ్డి పోరాడిన ధీరురాలు సావిత్రి బాయి పూలే 130 వ వర్ధంతిని శుక్రవారం స్థానిక శివాలయం వీధిలో నిర్వహించి ఆమె చిత్రపటానికి పూలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్, కడప పార్లమెంటరీ బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.సత్యసాయి సుబ్బరాజు, పార్లమెంటరీ కార్యదర్శి సి.సిద్దయ్య, రాష్ట్ర దేవాంగ సాధికారిక కమిటి కార్యదర్శి అంపావతిన సుబ్బు, పట్టణ నందమూరి యువసేవాసమితి అధ్యక్షుడు గోమేధికమ్ సుదర్శన్, తెలుగుదేశం నాయకులు యమ్.మహేష్ కుమార్ పాల్గొన్నారు.

## అరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి

ప్రొద్దుటూరు మార్చి 10, ప్రభాతవార్త



ప్రజలకు ఆరోగ్యంపైన, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించా ల్సిన బాధ్యత ఆశా ఆరోగ్య కార్యకర్తలపై ఉందని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ రోజు జరిగిన ఆషా కార్యకర్తల సమావేశంలో మాట్లా డుతూ గర్భవతుల బాలింతల చిన్న పిల్లల ఆరోగ్యం పై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి అని మారిన పరిస్థితులకనుగుణంగా చైతన్య పరచాలని కోరారు. మలేరియ సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వారం వారం జరిగే డ్రై డే ఫ్రైడే పై ప్రజలను చైతన్య పరచుట ద్వార దోమల వల్ల వచ్చే మలేరియా డెంగీ జ్వరాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ క్రిష్ణమ్మ హెచ్ఈ శోభరాణి సూపర్‌వైజర్ బి.ఏ.వర ప్రసాద్ చంద్రకళ ఆరోగ్య కార్యకర్తల లక్ష్మీనారాయణ చంద్రశేఖర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల సీహెచ్ఓలు మహిళా ఆరోగ్య, ఆషాకార్యకర్తలు పాల్గొన్నారు. కార్య క్రమానికి హాజరైన అందరికీ రాష్ట్ర బీ.సీ సంక్షేమ నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ భోజన వసతి కల్పించారు.

## యువగళంకు పెరుగుతున్న ప్రజాదరణ

### పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి గంటానరహరి

మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :



రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది తెలుగుదేశం పార్టీయేనని రాజంపేట పార్ల మెంటు నియోజకవర్గ అభ్యర్థి గంటా నరహరి అన్నారు. శుక్రవారం యువనేత నారాలోకేష్ మదనపల్లెలో రెండో రోజు యువగళం పాదయాత్రలో గంటా నరహరి పాల్గొన్నారు. యువనేత పాదయాత్రకు వేలాదిమంది టిడిపి నాయ కులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు కలిసి పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలి పారు. ఈ సందర్భంగా గంటానరహరి మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో రెండోరోజు యువగళం పాదయాత్ర నిర్విఘ్నంగా సాగుతోందని, యువగళంకు ప్రజాధారణ పెరుగుతోందని. ప్రతి అడుగులో అడుగులు వేసి ఆత్మవిశ్వాసం అందరిని ఒకేతాటిపై నడిపిస్తూ ఏపికి సరికొత్త మార్గాన్ని చూపిస్తొందన్నారు. ఇది ఏపి ప్రజల కోసం లోకేష్ చేస్తున్న పాదయాత్రగా నరహరి అన్నారు.

## బాలికా విద్యను ప్రోత్సోహించాలి

కడప మార్చి 10, ప్రభాతవార్త



నగరంలోని స్థానిక చెమ్ముమియా పేట జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కెనరాబ్యాంకు శంకరాపురం వారి సౌజన్యంతో ప్రతిభావంతులైన ఆరుగురు విద్యార్థినులకు కెనరా విద్యా జ్యోతి పథకం కింద ఉపకారవేతనాలు పంపిణీ చేయడమైనది. ఈ సందర్భం గా ముఖ్య అతిధి బ్యాంకు చీఫ్ మేనేజర్ క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ బాలికా విద్యను అందరూ ప్రోత్సాహించాలని అపుడే వందశాతం అక్షరాస్యత సాధ్యం అన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా బ్యాంకు విద్య విభాగాలలో పాలు పంచుకోవడం సంతోషం అన్నారు. అతిథిగా విచ్చేసిన విద్యాశాఖ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు అందరికీ ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. హెడ్మాస్టర్ మేరీ, బ్యాంకు సిబ్బంది నరసింహ,పవన్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయునులు పాల్గొన్నారు. పిల్లలందరికి బిస్కెట్లు పంపిణీ చేశారు.

## సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి

జమ్మలమడుగు, మార్చి 10, ప్రభాతవార్త:



చదువుల తల్లి సరస్వతి సావిత్రి బాయి పూలే 126వ వర్ధంతిని జమ్మల మడుగు పట్టణం ఎస్సీ కాలనీలో ఆ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు మాట్లాడుతూ సావిత్రబాయి పూలే గొప్ప భారతీయ సంఘ సంస్కర్త అని రచ యితిని అని ఆమె నిమ్మ వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు కుందవరం పుష్పరాజు, సీనియర్ నాయకులు సుబ్బగాళ్ల నరసింహులు, ఏపీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఒరుగంటి పెద్దలయ్య, సలహాదారుడు గొరిగె నూరు బాలయ్య, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు నాగస్వరం యువరాజు, కోనేటి నిఖిల్, బీసీ నాయకుడు చాపల మునిస్వామి పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 10, ప్రభాతవార్త:



సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల 4వ సంవత్సరం బీటెక్ సీఎస్ఈ విభాగానికి చెందిన ధరణి, విజయలక్ష్మీ 6డి టెక్నాల జీస్ బెంగళూరుకు చెందిన కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపల్ డా.పాండురంగన్‌రవి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.4లక్షల వేతనం ఇవ్వడం జరుగుతుందని డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డా.పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు.ఎంపికైన విద్యార్థులను ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ. వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు అధ్యాపకులు అభినందించారు.

## పూలేకి ఘన నివాళులు

పులివెందుల రూరల్, మార్చి 10, ప్రభాతవార్త :



సావిత్రిభాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పులివెందులలో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి శుక్రవారం నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌ఛార్జి చంద్రమౌళి, వైకాపా నాయకులు పద్మనాభరెడ్డి, రవి, నాగరాజు, సంపత్, చలపతి, రాజశేఖర్, కుళ్లాయప్ప, బాదుల్లా, బాబావలి, నట్టు శేఖర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నిర్మూళన విజయవంతం చేద్దాం

కలికిరి, మార్చి 10 ప్రభాతవార్త:



జాతీయ నులి పురుగుల నిర్మూళన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపిడిఓ గంగయ్య పేర్కొన్నారు. శుక్ర వారం ఎంపిడిఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల కార్యక్రమంపై వైద్యశాఖ ఐసిడిఎస్ శాఖలతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మార్చి 14న అన్ని అంగన్ వాడీ లు, పాఠశాలలు,కళాశాలలు ఆల్‌బెండర్‌జోన్ 400మిల్లిగ్రాముల మాత్రలను మద్యాహ్నం విద్యార్థులు భోజనం తరువాత తినిపించాలని ఎంపిడిఓ సూచిం చారు. సమావేశంలో మేడికుర్తి వైద్యాధికారిణి కావ్యగంధ, హెల్త్ సూపర్‌వైజర్ సారమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్‌ను కలిసిన ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషన్

కమలాపురం, మార్చి 10, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ మండల నాయకులు ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు హిదయతుల్లా, ఛైర్మన్ డా.కె.ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి శుక్రవారం ఉదయం ఏపీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీ స్టేట్ మైనారిటీస్ కమిషన్ వైస్ ఛైర్మన్ డా.జాషువా, డానియేల్, మెంబర్లు సైఫుల్లా, జితేంద్ర జిత్‌సింగ్, సయ్యద్ హిదయతుల్లా ఏపీ గవర్నర్‌ను సత్కరించారు.

## యువగళంకు తరలిన టిడిపి నాయకులు

రామసముద్రం, మార్చి 10 ప్రభాతవార్త :



రామసముద్రం మండలం నుండి పెద్దఎత్తున నారాలోకేష్ యువగళం పాదయాత్రకు బయలుదేరిన టిడిపి నాయకులు, కార్యకర్యలు అధికసంఖ్యలో శుక్ర వారం టిడిపి మండల అధ్యక్షులు విజయగౌడు ఆధ్వర్యంలో పాదయాత్రకు బయలుదేరి వెళ్ళారు. మదనపల్లెలో జరుగుతున్న యువగళం పాదయాత్రకు వీరంతా కలసికట్టుగా నారాలోకేష్ పాద యాత్రకు సంఘీభావం తెలిపారు. విజయగౌడు, గజ్జల సీతయ్య, శ్రీనివాసగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, చిన్నస్వామి, రెడ్డప్ప, వేణు, శివకిట్ట, సలీంబాలాజి, విజయభాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కమలాపురం, మార్చి 10, ప్రభాతవార్త:

కమలాపురం మండల పరిసర గ్రామాల్లో నేడు 2వ శనివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని కమలాపురం మండల ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ విద్యాసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 11 కేవీ, 33 కేవీ విద్యుత్తు లైన్లు మరమ్మతులు నిర్వ హిస్తున్నామని శనివారం ఉదుం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. మండల పరిసర గ్రామాల వినియోగదారులు సహక రిం చాలని విద్యుత్తు అధికారులు కోరారు.

NAME CHANGE

Kothamasi Shobitha D/o K.Sudhakar Rao(as mentioned in bank A/c) R/o #4/211, Nagaraju pet, Kadapa, Y.S.R.Dist., A.P. Hereby state that my name as per Aadhaar card is Shaik Sadiya Begum after converting into Islam hence both names are one and same.

# సెంట్రల్ సిలబస్ పేరుతో అక్రమ అడ్మిషన్లు

## పట్టించుకోని విద్యాశాఖాధికారులు

పీలేరు, మార్చి 10 ప్రభాతవార్తః



పట్టణంలోని గౌతమ్ పాఠశాల గుర్తింపుతో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న తపస్య కార్పోరేట్ పాఠశాలలో సెంట్రల్ సిలబస్ సబీఎస్ఈ పేరుతో పట్టణంలోని విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి అక్రమ అడ్మిషన్లు చేస్తున్నా రని డీబీఎస్ఎఫ్ జిల్లా అధ్య క్షులు బద్దె భాను ప్రకాష్ అన్నారు. శుక్రవారం స్తానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులకు కరపత్రంలో విదా ్యర్థుల భవిష్యత్తును ఎరగా చూపి నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్నారని అనేకసార్లు మండల విద్యాశాఖ అధికారులకు విన్నవించిన ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పీలేరు పట్టణంలో ఏ ఒక్క పాఠశాలకు సెంట్రల్ సిలబస్‌కు గుర్తింపు లేదని ఆయినా వేలాది రూపా యలు వసూలు చేస్తున్నారన్నారు. ఈమధ్యకాలంలో కొత్తగా వచ్చిన ఇలాంటి పాఠశా లలు కార్పోరేట్ తెలివితేటలు ఉపయోగిస్తూ మధ్యతరగతి కుటుంబాలకు సంబం ధించిన విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుకునేందుకు ఇలాంటి కుయుక్తులు పడుతున్నారన్నారు. విద్యార్తులను ఇలాంటి పాఠశాలల నుంచి విముక్తి కల్పించాలని ఉన్నతస్థాయి విద్యాధికారులు పాఠశాల యాజ మాన్యం ఆర్థిక అంగ బలానికి తలొగ్గి ఎటువంటి చర్యలు తీసుకో లేదన్నారు. పీలేరు పట్ట ణంలో ప్రజలు ఇలాటి గుర్తింపులేని పాఠశాలల మోజులో పడి విద్యార్తుల భవి ష్యత్తు నాశనం చేసుకుని ఆర్థిక ఇబ్బందులు పాలు కావద్దని వారు పిలుపు నిచ్చారు. ఒక పాఠశాల అయితే మరొక పాఠశాల పేరుతో బదిలీ సర్టిఫికేట్ రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చేసిన పరిస్థితి చూసామన్నారు. మళ్లీ అదే తరహాలో ఈపాఠశాల నడుస్తుందన్నారు. కాబట్టి వెంటనే దీనిపై డీఈఓ చర్యలు తీసుకోని పక్షంలో విద్యార్తి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# విశాఖపట్టణం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం

ఖాజీపేట మార్చి 10, ప్రభాతవార్త



విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వె స్టర్ సమ్మిట్‌లో బడా పారిశ్రామిక వేత్తలు రావడమే కాకుండా 16 లక్షల కోట్లు పెట్టు బడులు జగ న్మోహన్ రెడ్డి మీద నమ్మకంతో మాట ఇస్తే తప్పడు అనే నమ్మకంతో పెట్టా రని పెద్ద పెద్ద కంపెనీలు రాష్ట్రానికి రాబోతున్నాయని మైదుకూరు శాసనసభ్యులు రఘురామి రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల తర్వాత భారతదేశంలో ఏ రాష్ట్రంలో జరగనటువంటి హామీలు నెరవేర్చిన ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రథమ స్థానంలో ఉన్నారని దాదాపు 95శాతం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ధైర్యం గా మమ్మల్ని ఆదరించండి జగ న్మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి అని ప్రజలను అడుగుతామని అన్నారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నిక లలో కచ్చి తంగా వైసీపీ అభ్యర్థి గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికలలో 175 అసెంబ్లీ సీట్లకు 175 గెలుస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు కార్యక్రమంలో మండల ఎంపీపీ అబూబ కర్ సిద్దిక్, రాష్ట్ర ఏపీఐఐసీ డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగా ధర్ రెడ్డి, మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి, మండల సర్పం చుల సంఘం అధ్యక్షుడు రావుల పల్లె సర్పంచ్ పైడేల శివరామిరెడ్డి రావులపల్లె ఎంపిటిసి కనుపర్తి సుబ్బారెడ్డి, వైసిపి ,నాయకులు కార్యకర్తలు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఉరుసు

చిన్నమండెం.మార్చి10 ప్రభాతవార్త



మండల కేంద్రంలో వెలసిన హజరత్ షా అలీ గంజే షాహీద్ బాబా రహమతుల్లా అలైహి ఉరుసు 11, 12వ తేదీలలో నిర్వహించనున్నట్లు దర్గా కమిటి సభ్యులు తెలియజేశారు. ఉరుసు కార్యక్రమానికి కడప గురువు అరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్లా సేనిలిప్టిపుల్ కాదరి పాల్గొని దర్గాలో గంధం ఎక్కించనున్నారు. ఫాతిమా కార్య క్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ ఉరుసులో డీల్లీ, ముంబై, ఆంద్రా గాయకులచే గొప్ప ఖవాలీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కరోజు ఖవాలి పోటీలను ప్రముఖ వ్యాపారవేత్త ఏజాజ్ అలీఖాన్ తన తండ్రి కీర్తిశేషులు షాబాద్ అలీఖాన్ జ్ఞాపకార్థం నిర్వహించ నున్నారు. పకీర్ల విన్యాసాలు, రాజస్తాన్ డ్రమ్ము శబ్దాలతో ఉరుసు కార్యక్రమం లో ఉంటా యన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియ జేశారు. వేలాది మంది హిందూ ముస్లీం సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# భూ సమస్యలకు కారణం రెవిన్యూ అధికారులే

బ్రహ్మంగారి మఠం, మార్చి 10 ప్రభాతవార్త :



మండలంలోని గుండాపురం గ్రామంలో గురువారం జరిగిన భూ తగాదాలలో ఇరు వర్గాల మధ్య పర స్పర దాడులు జరిగిన నేపథ్యంలో ధ్వంసం కాబడిన సిద్దయ్య ఇల్లు, సమస్యకు కారణమైన భూమిని సీపీఎం బృంధం పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శివ కుమార్ మాట్లాడుతూ మండలంలో జరిగిన ఈ సంఘటన దురదృష్ట కరమైనదని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదని ఇరు వర్గాలు సమన్వయం పాటించాలని, ఈ భూ సమస్యల గొడవలకు రెవిన్యూ అధికారులే బాధ్యత వహించాలని, రెవిన్యూ అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, బాధ్యత రాహి త్యం కారణంగానే ఈ గొడవలు జరిగాయని వారు విమర్శించారు. మండలంలో ఇష్టానుసారంగా ఇబ్బడి ముబ్బడిగా భూములను ఆన్‌లైన్ చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయని, కలెక్టర్, ఎస్పీ, డిఎస్పీ దగ్గరికి అనేక మంది బాధితులు వెళుతున్నారని, నందిపల్లె, బి.మఠం, సోమిరెడ్డిపల్లె, పలుగురాళ్ళపల్లె గ్రామాల లో సహితం ఇటువంటి సమస్యలను పరిష్కరించడంలో రెవిన్యూ అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహించారని, గతంలో తహసీల్దారుగా పనిచేసిన దైవాదీనం, సాయినాథ్ హయాంలో జరిగిన భూముల ఆన్‌లైన్ అస్తవ్యస్థంగా ఉన్నాయని, వాటి మీద విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, మండల కమిటీ సభ్యులు సునీల్ కుమార్, అజయ్ కుమార్, రాహుల్ పాల్గొన్నారు.

# అక్రమ రవాణా చేస్తున్న మద్యం స్వాదీనం

టి.సుండుపల్లి.మార్చి10 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని శివాజి నగర్‌వద్ద పొలిమేర పల్లి ఈడిగపల్లికు చెందిన బాలక్రిష్ణ అనే వ్యక్తి అక్రమ మద్యాన్ని రవాణా చేస్తున్నా డని పక్కా సమాచారంతో పోలీస్‌లు దాడి చేసి అతని వద్ద నుంచి 48 విస్కి బాట ళ్లను స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు.

# సావిత్రిబాయి పూలే గొప్ప దార్శనికురాలు

## - నీలి శ్రీనివాసరావు

కడప వైద్యవిభాగం, మార్చి 10, ప్రభాతవార్త:



సావిత్రి బాయి పూలే దార్శనికురాలని శుక్రవారం ఆమె వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే భారతదేశ స్వాతంత్ర్యానికి వంద సంవత్సరాల పూర్వమే దేశంలో మహిళల కోసం పాఠశాల స్థాపించారన్నారు. నాటి సామాజిక దురాచారాలైన బాల్యవివాహాలు, సతీసహగమనం లాంటి వాటిని వ్యతిరేకించి పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, పీడీఎఫ్ నరగాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు, రమేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ప్రసన్న, కణతల ప్రసాద్, సూర్యుడు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

# నేడు పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేత

రాజంపేట అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త

సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్వహణలో భాగంగా శనివారం రాజంపేట డివిజన్ పరిధిలో పలుచోట్ల విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఎడిఇ ఎం.సురేంద్ర నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కెవి లైన్లకు సమీపంలో ఉన్న చెట్లను తొ లగిస్తామన్నారు. తాళ్లపాక, ఆకేపాడు, సరస్వతిపురం, రెడ్డిపల్లె, కొండూరు, పెన గలూరు, టిజిపల్లె, బెస్తపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోనే కాకుండా వాటి పరిధిలోని పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలన్నారు.

# ఎమ్మెల్సి ఎన్నికలకు అన్ని విద్యాసంస్థలకు సెలవు ఇవ్వాలి

## ఎస్‌టియు రాష్ట్రనేత వై.సుబ్రమణ్యంరాజు

రాజంపేట అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త

ఎమ్మెల్సి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకొనేందుకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల అన్నింటికి సోమవారం సెలవు ప్రకటించాలని ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వై.సుబ్రమణ ్యంరాజు కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటుహక్కు ఎంతో కీలకమైందన్నారు. ముఖ్యంగా ప్రస్తుత శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయులే ప్రధాన ఓటర్లు అన్నారు. సెలవు ప్రకటన విషయం గందరగోళంగా మారిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకొని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని ఆయన కోరారు.

# నులి పురుగులను నివారిద్దాం..

## - డిప్యూటీ డిఎంహెచ్‌వో చంద్రహాస రెడ్డి

బద్వేలు అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త :



నులి పురుగులను నివారించి, బాల బాలికల ఆరోగ్యాన్ని కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ డిఎంహెచ్‌వో డా॥ చంద్రహాస రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్వాడీ ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశా నికి హాజరైన డిప్యూటీ డిఎంహెచ్‌వో చంద్రహాస రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన అంగన్వాడీ పాఠశాలల్లో ఉన్న బాల బాలికలకు ఆల్బెండజోల్ మందు లను మింగించాలన్నారు. విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అనంతరం వైద్యాధికా రులు జ్యోత్స్న, వినయ్ కుమార్ మాట్లాడుతూ ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ ఎన్‌సిడిసిడి మైగ్రేషన్, పిఎంజేఏవై కార్డులు పూర్తి చేయాలన్నారు. ఇమ్యునైజేషన్ కార్యక్రమం లో ప్రతి పిల్లవాడికి టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఆరోగ్య సిబ్బంది జనార్ధన్‌రావు, మహమ్మద్, ఖాసింతో పాటు పలువురు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణపై అవగాహన

దువ్వూరు, మార్చి 10, ప్రభాతవార్త:



స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో శుక్ర వారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై సిబ్బందికి అవగా హన సదస్సు నిర్వహిం చారు. ఈ సమావేశంలో డా.షమీరా మాట్లా డుతూ ప్రతి సంవత్సరం 2 సార్లు ఒక సంవత్సరం నుంచి 2 సంవత్సరాల పిల్ల లకు అర్ధ మాత్ర, 2 సంవ త్సరాల నుంచి 19 సంవత్సరాల వరకు 1 మాత్ర ఆల్‌బెండోజెల్ అందజేస్తామన్నారు. సర్వే ప్రకారం 34శాతం పిల్లలు రక్తహీనతతో కిశోర బాలికలు , గర్భవతులు, బాలింతలు 66 శాతం మంది రక్తహీనతతో నులిపురుగులతో రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. ఎంపీడీవో జగదీ శ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యా యులు పిల్లలకు మాత్రలు మింగించి దువ్వూరు మండలంలో వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విజయకుమారి వైద్యసిబ్బంది శివ రామయ్య, మునిస్వామి, ఉపాధ్యాయులు, ఆరోగ్యకార్యకర్తలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజియాభాను పాల్గొన్నారు.

# ఉన్నత చదువులు అభ్యసించాలి : ఎమ్మెల్యే

కడప కార్పొరేషన్, మార్చి 10, ప్రభాతవార్త:




ఉపాధ్యాయులు బోధించే పాఠాలు ఏకాగ్రతతో శ్రద్ధగా వినాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి విద్యార్థులకు సలహా ఇచ్చారు. ఉన్నత చదువులు చదివి ప్రయో జకులు కావాలన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. శుక్రవారం కడప రామరాజుపల్లిలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో జరిగిన వార్షికోత్స వాలకు ఆయన హాజరై ప్రసంగించారు. నాగార్జున స్కూల్లో చదివిన విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని కొనియాడారు. వైవీయూ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్ర వేత్తలు కావాలని పిలుపునిచ్చారు. స్కూలు విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా వికాసంతో పాటు సమాజ వికాసానికి అవసరమైన వసతులు కల్పిస్తూ ఎప్పటికప్పుడు అత్యాధునిక బోధనా పద్ధతులను అవలంభిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. అనంతరం చిన్నారులకు కాన్వకేషన్ పట్టాలు అందజేశారు. వివిధ పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో వైవీయూ ప్రొఫెసర్ పుత్తా పద్మ, స్కూలు డీన్ కుళాయప్ప, ప్రిన్సిపల్ కృష్ణవేణి, వీర శివ, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సామాజిక తనిఖీ రూపంలో వ్యాపారం

కేవి.పల్లె, మార్చి 10 ప్రభాతవార్తః

పీలేరు నియోజకవర్గం కేవి.పల్లె మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగ రోజువారి కూలీలకు రోజు పని కల్పించాలని అటువంటి ఉద్దేశ్యంతో అనేక రకాల పనులు ద్వారా పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందరికి ఉపాధి కలి ్పంచాలని నిర్వహిండం జరుగుతోంది. ఈకార్యక్రమంలో ప్రతి గ్రామంలో రాజకీయ, ఆర్థిక అంగబలం కుల బలం కలిగినటువంటి ప్రత్యేకమైనటువంటి వ్యక్తులకు మాత్రమే గ్రామీణ స్థాయిలో ఉన్నటువంటి ఎఫ్ఏ, టీఏ, పీఓలు పనులు మంజూరులో జాబ్ కార్డు దారుల సంబంధం లేకుండా బీపీఎల్ పరిధిలోని పేదలను పరిగణలోకి తీసుకోకుండా ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించకుండా పనుల కోసం అనేక మంది రెక్కాడితే కాని డొక్కడక విలవిలలాడుతుంటే ప్రభుత్వాలు యొక్క ఉద్దేశాన్ని పూర్తిగా విస్మరిస్తూ సంబంధిత శాఖలో పనిచేస్తున్నటువంటి గ్రామ మండల స్థాయి అధికారులు వారి యొక్క ముడుపులే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తూ జేసీబీలు ద్వారా చేసిన పనులకు బిల్లులు చేస్తూ పనులు లేకపోయినా వాటికి గతంలో చేసిన పనులను చూపిస్తూ పోటోలు మార్ఫింగ్ చేస్తూ మస్టర్లను సంబంధం లేకుండా హాజరు పని ప్రదేశంలో పని చేసే వారికి సంబంధం లేకుండా వారి స్వగహాలు వారు ఉన్నటువంటి ప్రాంతాలే అన్నిటికి కూడా కేంద్ర బిందువులుగా భావిస్తూ పూర్తిగా వ్యాపార కేంద్రంగా ఉపాధిహామీ కార్యాలయాలు ఒక ఉపాధి హామీ ఎఫ్ఏ ఉద్యోగంలో చేరిన కొంత కాలం ఎంతమేర ఆర్థికంగా బలపడుతున్నాడు. వారి స్తి ్తిగతులను పరిగణలోకి తీసుకుంటే కేవి.పల్లె మండలంలో పనిచేస్తున్నటువంటి అనేకమంది ఎఫ్ఏలు నిలువుటద్దంలా కనిపిస్తారు. పనులు కల్పించడంలో పేదలకు అన్యాయం జరి గింది. దళితులను పనులకు అనర్హులుగా వారికి వారే స్వయం ప్రకటించుకుని ఉపాధి హామీ అధికారులు వ్యవహరించారు. ఉపాధిహామీ కార్యాలయంలో దళితులు ఉన్నప్పటికి ఉన్నత స్థాయిలో మండలంలోని అధికారులు దళిత ద్రోహులుగా బడాబాబులకు చెంచాగిరిదారులుగా వ్యవహరిస్తూ పనిచేయడం జరుగుతుంది. వీటన్నిటికి సంబంధించి ఇప్పటి వరకు జరిగిన పనులపై గతంలో అనేకమార్లు సామాజిక తనికీవారు నిర్వహించిన గ్రామస్థాయిలోని ఏఫ్ఏ వారిని వీఎస్ఏల ద్వారా డీఆర్‌పీల ద్వారా ఎస్ఆర్‌పీలను మభ్యపెడుతూ వారికి తాయిలాలను, చెల్లిస్తూ గతంలో సామాజిక తనిఖీలను కూడా సమగ్రంగా నిర్వ హించకుండా పక్కదోవపట్టించడం జరిగింది. గత సంవత్సరాలతో పోలిస్తే మరింత ఎక్కువ మొత్తంలో కొనేటువంటి ప్రయత్నంలో పూర్తిగా నిమగ్నం అవడం జరుగుతుందని సమాచారం. ఉపాధిహామీ పనులలో జరుగుతున్నటువంటి అవక తవకలను జరిగినటువంటి విధానాలను సమగ్రమైనటువంటి నిజాలను నిగ్గు తేల్చి ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో సామాజిక తనిఖీ అందులో పనిచేస్తున్నటువంటి అధికారుల ప్రజల పక్షాన నిలవాల్సి నటువంటి సమయంలో వారి యొక్క విధివిధానాలను పక్కనపెట్టి అధికారులు ఆర్థిక ఆధారాలు మార్చుకుంటూ సామాజిక తనికీ నిర్వహించడం జరుగుతుందని దానికి సంబం ధించి కొన్ని గ్రామాల డీఆర్‌పీలు, ఎస్ఆర్పీలకు, ఎఫ్ఏలు ఎంత మొత్తం చెల్లిం చడం జరుగుతుందో బయట పడడం జరుగుతోందని ఇకనైనా సామాజిక తనిఖీ వారు వారి శాఖ ఉద్దేశాన్ని వారిపై ప్రజలకు ఉన ్నటువంటి నమ్మకాన్ని వమ్ము చేసుకోకుండా నిజాలను నిగ్గుతేల్చాలన్నారు. లేని పరిస్ ్తితుల్లో ఉపాధిహామీ కమిషనర్ వారికి పనులు ఇప్పటివరకు జరిగినటువంటి పనులు వాటిలో జరిగినటువంటి అవకతవకలు సామాజిక తనిఖీవారు సమర్పిస్తున్నటువంటి పూర్తి ఆధారాలతో వారికి సమర్పించడం జరుగుతుందని భారతీయ జనతా యువమోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మనపల్లె పురుషోత్తం అన్నారు.

# చరిత్రలో ధ్రువతార సావిత్రిబాయి

## - బీసీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్

కడప వైద్యవిభాగం, మార్చి 10, ప్రభాతవార్త:



ఆధునిక భారత చరిత్రలో ధృవతార సావిత్రీబాయి పూలే అని బీసీ సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు మాసా కోదండ రామ్ అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా కడప నగరంలోని బీసీ సంక్షేమ వేదిక కార్యాలయం లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి స్త్రీ, పురుషులు కులమతాలకు అతీతంగా విద్య నభ్యసించడం సహజమైన హక్కు అని అందుకే అందరూ చదవాలి.. అందరూ సమానంగా బతకాలి అని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రి బాయి అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు పీర్ల గంగాధర్ యాదవ్, కడప జిల్లా బీసీ నేతలు చిట్టిబోయిన సుబ్బరాయుడు యాదవ్, గంగాధర్ యాదవ్, గిరి చరణ్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

దువ్వూరు, మార్చి 10, ప్రభాతవార్త:



ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు పరిశీలించారు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో పట్టభద్రుల నియోజకవర్గానికి ఒక కేంద్రం, అలాగే టీచర్స్ ఎమ్మెల్సీకి గాను మరో కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో కనీస వసతులు తదితర వాటిపై చర్చించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాటు చేయాలని, ఓటర్లు వచ్చేందుకు, బందోబస్తు తదితర వాటిపై సూచనలు చేశారు. సమస్యలు లేకుండా పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అనంతరం హైస్కూల్లో ఏర్పాటు చేసిన 2 పోలింగ్ గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాకుమారి, డీటీ షఫీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ రేషన్ బియ్యం సీజ్

మైదుకూరు మార్చి 10, ప్రభాతవార్త

మైదుకూరు మండల పరిధిలోని నానుబాలపల్లెలొ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శుక్రవారం ఓ ఇంటిని తనిఖీ చేశారు.ఆ ఇంటిలో అక్ర మంగా నిల్వ ఉంచిన 24 బస్తాల రేషన్ బియ్యంను పట్టుకొని సీజ్ చేశారు. ఖాజీపేటకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి ఆ ఇంటిలో రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచుకొని తర్వాత అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసినట్లు మైదుకూరు అర్బన్ ఎస్ఐ గణ మద్దిలేటి తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

# నారా లోకేష్‌కు గజమాలతో ఘన స్వాగతం

కురబలకోట, మార్చి 10 ప్రభాతవార్త :



యువగళం పాదయాత్ర చేపట్టిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు కుర బలకోట అమ్మచెరువుమిట్ట వద్ద తంబళ్ళపల్లె ఇన్‌చార్జ్ జి.శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు. కుప్పం నుంచి చేపట్టిన పాదయాత్ర నేటితో 40వ రోజుకు చేరింది. అన్నమయ్యజిల్లాలోని తంబళ్ళపల్లె నియోజకవర్గం కుర బలకోట మండలంలోకి ప్రవేశించడంతో నారా లోకేష్‌కు భారీగా టిడిపి నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. తంబళ్ళపల్లె నియో జక వర్గంలోని అమ్మచెరువుమిట్ట నుంచి ఈ పాద యాత్రకు నారాలోకేష్ వెంట తంబళ్లపల్లె టిడిపి నాయకులు అధికసంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలుపుతూ వెంట నడిచారు. అమ్మచెరువుమిట్ట నుంచి చేనేత నగర్ వరకు ఈ పాదయాత్ర కొనసాగింది. చేనేతనగర్ వద్ద విడిది కేంద్రం వద్దకు చేరుకొన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ అభ్యర్థి గంటా నరహరి, బిసిసెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, గుత్తికొండ త్యాగరాజు, కోవైటీశంకర్, వైజీరమణ, మండల కన్వీనర్ సురేంద్ర యాదవ్, మోహన్‌రెడ్డి, అయూబ్‌బాషా, మొటుకుశీన, బాలక్రిష్ణ, శ్రీనాథ్ రెడ్డి, మండల కార్యదర్శి రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

# సూచిక బోర్డులో అధికారులు పేర్లు మారేనా?

నిమ్మనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :




అన్నమయ్యజిల్లా నిమ్మనపల్లె మండలం తవళం గ్రామ పంచాయితీలో మండల స్థాయి అధికారుల పేర్లు, గ్రామ సచివాలయంలో పనిచేసే అధికారులు పేర్లు ఫోన్‌నెంబర్లు, బ్యానర్లలో రాయ బడ్డాయి. కాని రోజులు, నెలలు, సంవత్సరాలు కిందట బదిలీ అయిన అధికారుల పేర్లే ప్రస్తుతం దర్శనమిస్తు న్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ప్రస్తుత పనిచేస్తున్న అధికారులు పేర్లు రాయాలని పలువురు కోరుతున్నారు.

# అక్కులాయపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్

మైదుకూరు మార్చి 10, ప్రభాతవార్త



మైదుకూరు మండలం వని పెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని అక్కులాయపల్లెలో ఫ్యామిలీ ఫిజిషి యన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహిం చారు. వనిపెంట పీహెచ్సీలో జరిగే డిపి ఎంఆర్ కార్యక్రమమును జిల్లా అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.ఖాదర్ వల్లి తనిఖీ చేయడం జరిగినది. కార్యక్రమములో గర్భవతులను, బాలింతలను పరీక్షించడం జరిగింది. అలాగే లెప్రషి, టీబీ వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. కార్యక్రమం డాక్టర్ వి.మల్లేష్ ఆధ్వర్యంలో జరిగినది. డిపిహెచ్ఓ లక్ష్మీపతి, పి.బి.సి.ఓ ఆర్డినేటర్ శంకర్, ఎఫ్‌పిసి పర్యవేక్షకులు కే.సుబ్బ రాయుడు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పరపల్లె ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు



- అక్రమమా.. సక్రమమా..
- నేషనల్ హైవే పక్కన కోట్లాది రూపాయల ప్రభుత్వ స్థలాల కబ్జా..
- హాజరు కావాలని పది మందికి తహసీల్దారు నోటీసులు జారీ
- నోటీసులు ఖాతరు చేయని వైనం
- మరోసారి నోటీసులు జారీ చేస్తామని తహసీల్దార్ శంకర్‌రావు వెల్లడి

సిద్దవటం, మార్చి 10, ప్రభాతవార్త:

మండలంలోని కడప - చెన్నై జాతీయ రహదారిలో ఉప్పరపల్లె గ్రామంలో భారీ ఎత్తున వస్త్ర దుకాణాల షాపింగ్ కాంప్లెక్స్‌లు పుట్టగొడుగుల్లా నిర్మాణాలు వెలిశాయి. ప్రస్తుతం ఈ నిర్మాణాలు సక్రమమా.. అక్రమమా అంటూ ఉప్పరపల్లి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది. విషయంలోకి వస్తే పెద్దపల్లి గ్రామ సర్వే నెంబర్ 936/ఎలో ఉప్పరపల్లె గ్రామ పేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేసి ఉన్నారు. పేదలకు పంపిణీ చేసిన స్థలాలు నేడు కబ్జాదారుల కోరల్లో చిక్కుకోవడంతో మండల తహసీల్దారు శంకర్‌రావు ఆదేశాలతో వీఆర్వో గౌస్‌బాషా పది మందికి నోటీసులు జారీ చేయడం జరిగింది. బుధవారం నోటీసులు జారీ చేసినా వారు తహసీల్దారు ఉత్తర్వులు ఖాతరు చేయకుండా రాకపోవడంతో తిరిగి నోటీసులు జారీ చేస్తామని తహసీల్దారు శంకర్‌రావు తెలిపారు. పేదవాడు జానెడు స్థలంలో తాత్కాలికంగా నిర్మాణాలు చేపడితేనే ఉక్కు పిడికిలితో కబళించే రెవెన్యూ అధికారులు భారీ ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నా ఎందుకు చోద్యం చూస్తూ ఉన్నారో అంతు పట్టని విషయం. కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. కడప - రాజంపేట హైవే రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు 10 సెంట్ల నుంచి సుమారు 25 సెంట్లు వరకు నిర్మాణాలు జరుగుతుంటే ప్రభుత్వ అధికారులు ఏం చేస్తున్నారని ప్రధాన రహదారిలోనే ఇంత జరుగుతున్నా పట్టించుకోని అధికారులు మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయితే ఇంకేం పట్టించుకుంటారని పలువురు బహిరంగంగానే తెలుపుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటే తప్ప భూ కబ్జాలు ఆగేట్లు లేవు.

### పంచాయతీ అనుమతులు షాపింగ్ కాంప్లెక్స్‌లకు ఉన్నాయా?

ఏవైనా నిర్మాణాలు జరగాలన్నా ముఖ్యంగా పంచాయతీ అనుమతులు పొంది ఉండాలి. అటువంటివి ఏమీ పట్టకుండానే షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణాలు మొదలయ్యాయా? ప్రస్తుత షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారినా పంచాయతీ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవమరిస్తుం డడంతో లోపాయికారీ ఒప్పందం ఏమన్నా ఏర్పడిందా అని పలువురు గుసగుస లాడుతున్నారు. పంచాయతీ ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోకపోవడం చూస్తే షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు సక్రమమా, అక్రమమా? అర్థం కావడం లేదని పలువురు చర్చించుకోవడం గమనార్హం. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లకు కమర్షియల్ పన్ను అనేది వేశారా లేదా అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేస్తే నిజానిజాలు బయటపడతాయని పలువురు కోరుతున్నారు.

## ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా శ్రీ కన్యక పరమేశ్వరి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

**పేద ఆర్యవైశ్యుల స్వయం ఉపాధికి తోడ్పాటు**

**- ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ**



శ్రీ కన్యకా పరమేశ్వరీ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే.

బద్వేలు అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త :

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని మైదుకూరు రోడ్‌లో శ్రీ కన్యకా పరమేశ్వరీ నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ, ఏపి ఎన్విరాన్‌మెంట్ ఛైర్మెన్ గుబ్బా చంద్రశేఖర్, ఏపి మహా సభ జనరల్ సెక్రటరి మిట్టా కరుణాకర్, అడా ఛైర్మెన్ సింగసాని గురుమోహన్, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డిలు ప్రారంభించారు. ప్రారంభోత్స వానికి విచ్చేసిన వారికి ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, సెక్రటరి కొలిశెట్టి నాగరాజ, గౌరవ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్, రాచపూడి సాయి కృష్ణతో పాటు పలువురు కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం కాంప్లెక్స్ పరిధిలో నిర్మించిన 24 రూములను వారి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డా॥ సుధ, ఏపి ఎన్విరాన్‌మెంట్ ఛైర్మెన్ గుబ్బా చంద్రశేఖర్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో సుమారు 1200 కుటుంబాలు ఆర్యవైశ్యులు నివాసం ఉన్నారని, వారిలో పేద ఆర్యవైశ్యులను దృష్టిలో పెట్టుకొని ఆర్య వైశ్య సంఘం వారు శ్రీ కన్యకా పరమేశ్వరీ షాపింగ్ కాంప్లెక్స్‌లో వారి వ్యాపారాల నిమిత్తం రూములను నిర్మించడం సంతోషకరం అన్నారు. ఈ అవకాశాన్ని ఆర్యవైశ్య వ్యాపారస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు పి.వి.ఎన్.ప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయికృష్ణ, కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలాపురం జగదీశ్‌లు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో అనేక మంది వైశ్య ప్రముఖులు, గతంలో పనిచేసిన అమ్మవారిశాల కమిటీ అధ్యక్షులు షాపింగ్ కాంప్లెక్స్ కొరకు స్థలాన్ని ఏర్పాటు చేయడం పట్ల నేడు పలువురు ఆర్యవైశ్యుల జీవనోపాధి కొరకు ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దరిశి సుబ్రమణ్యం, తుమ్మలపెంట సురేష్ బాబు, సముద్రాల రాధాకృష్ణ, కొలిశెట్టి సత్యం, పలువురు ఆర్యవైశ్య వర్తక సంఘం, యువజన సంఘం, మహిళా మండలి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డ్రైవర్ల కండక్టర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



రాజంపేట డిపోలో నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు

రాజంపేట అర్బన్, మార్చి 10 ప్రభాతవార్త

రాజంపేట డిపోలో డ్రైవర్లు, కండక్టర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బిసి శేఖర్ కోరారు. శుక్రవారం డిపో వద్ద ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లపై డ్యూటీచార్ట్ వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు గత రెండు నెలలుగా సెలవులు మంజూరు చేయడంలేదని పేర్కొన్నారు. దీంతో చికీవులో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మహాశివరాత్రి వేడుకల్లో డబల్ డ్యూటీ చేసిన కార్మికులకు వెంటనే వేతనం మంజూరు చేయాలని కోరారు. చిట్వేలి, కోడూరు, తిరుపతి సెక్టార్లలో బస్సులు పెంచాలని డిమాండ్ చేశారు. మిగిలిపోయిన కండక్టర్లకు బలవంతంగా సెలవులు వేసే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ఎం.నరసారెడ్డి, సహాయ కార్యదర్శి మల్లికార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, కోశాధికారి మౌలా, గ్యారేజి కార్యదర్శి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుల తల్లి సావిత్రిబాయి పూలే

**- పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి**




కడప వైద్యవిభాగం, మార్చి 10, ప్రభాతవార్త:

మహిళలు అన్ని రంగాల్లో దూసుకు పోతున్నారంటే దానికి మూల కారణం చదువుల తల్లి సావిత్రి బాయి పూలే చలవేనని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి తెలిపారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్బంగా రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలంటే ఎంతో వివక్ష ఉండేదని మహిళలకు చదువు, విజ్ఞానం అందించకూడదని భావించిన అగ్ర కులాల ఆలోచనలను పటా పంచలు చేసి దేశంలోనే మొదటి మహిళా పాఠశాలలను నిర్మించి మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారని ఈ రోజు మహిళలు అన్ని రంగాల్లో తల ఎత్తుకొని సగౌరవంగా ఆత్మస్థైర్యంతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ఉపాధ్యాయు రాలిగా మహిళల చదువుల తల్లిగా పేరొం దిన సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లీం, ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్, రైతు నాయకులు ప్రతాప్‌రెడ్డి, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటేష్, బాలరాజు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

**తహశిల్దారు ఉదయ్‌శంకర్‌రాజు**

నందలూరు, మార్చి 10 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని ఎమ్మెల్సీకి సంబంధించి పోలింగ్ కేంద్రంను నందలూరు పంచాయతిలోని ఉర్దూ పాఠశాలను కేటాయించినట్లు మండల తహశిల్దారు ఉదయ్‌శంకర్‌రాజు తెలిపారు. ఇందులో గ్రాడ్యుయేట్ ఓటర్లు 935 మంది ఉన్నారని వారిలో 633 మంది పురుషులు 302 మంది స్త్రీలు ఉన్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మొత్తం 75 మంది ఓటర్లు ఉన్నారని వారిలో 44 మంది పురుషులు, 31 మంది మహిళా ఉపాధ్యాయులు ఈనెల 13వ తేదీన జరిగే ఈ ఎమ్మెల్సీ ఓటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చేవారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా గ్రాడ్యుయేట్లకు ప్రత్యేక పోలింగ్ 87ను, అలాగే ఉపాధ్యాయులకు సంబంధించి పోలింగ్‌స్టేషన్ 39ని ఏర్పాటు చేశామని అన్నారు. మంచినీటి వసతి, బార్కెట్లను ఏర్పాటు చేశామని ఓటింగ్‌కు వచ్చినవారు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## లోకేష్ పాదయాత్రలో నాదేండ్ల అరుణ్‌తేజ

మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త:



మాజీ మంత్రి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో టిడిపి తెలుగు యువత అధ్యక్షులు నాదేండ్ల అరుణ్‌తేజ పాల్గొన్నారు. శుక్రవారం పట్టణంలో లోకేష్ యువగళం పాదయాత్రకు వేలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో సాగింది. ఈ పాదయాత్ర తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుల శ్రీరామ్‌చినబాబు ఆధ్వర్యంలో అరుణ్‌తేజ పాదయాత్రలో పాల్గొన్నారు.

## బాస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :




తొలి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం బాస్ కార్యాలయంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ పాల్గొని ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు లర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్త్రీజాతికి సూద్రులకు విద్య నేర్పడం కోసం తొలి మహిళా ఉపాధ్యాయినిగా అవతరించిన చదువుల తల్లి సావిత్రిబాయి అని కొనియాడారు. శివప్రసాద్ మాట్లాడుతూ ఖాదీ చేనేత స్వదేశీ ఉద్యమ స్ఫూర్తి ప్రధాతగా అంటరానితనం, బాల్య వివాహాలు, మద్యపాన నిర్మూలన వం టి సంఘ సంస్కరణ ఉద్యమాలు చేపట్టి భారతదేశానికి సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాసులురెడ్డి, బాస్ నాయకులు రెడ్డెప్ప, క్రిష్ణ, జనార్ధన్, గంగాధర్, క్రాంతి, రెడ్డిప్రసాద్, చంద్ర పాల్గొన్నారు.

## నైపుణ్య, లక్ష్య సాధన మార్గాలపై కార్యశాల

జమ్మలమడుగు, మార్చి 10, ప్రభాతవార్త:




ప్రొగ్రెసీవ్ అలయన్స్ ఫర్ వాలంటరీ ఇనిషియేటీవ్ ఎన్జీవో ఆధ్వర్యంలో (పవి) ఎన్జీవో ఉపాధి అవకాశాలను పొందేందుకు స్థానిక సాయిపరమేశ్వర డిగ్రీ కాలేజీ విద్యార్థులకు వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు వారి ఉన్నతమైన భవిష్యత్తుకు ఎటువంటి లక్ష్యాలను నిర్దేశించుకోవాలి, అందుకు ఎటువంటి ఆలోచనా అవకాశాలను పొందేందుకు నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పెంపొందించు కోవడం వలన కలిగే ఉపయోగాలపైన అనుభవ పూర్వకమైన అవగాహన కలిగిం చారు. ఫౌండర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జమ్మలమడుగు ప్రాంతంలో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమా లను నిర్వహిస్తున్నామనీ, కొనసాగింపుగా యువత నైపుణ్య శిక్షణకు మరిన్ని అవకాశాలను కలిగించేందుకు యూత్ ఎంగేజ్‌మెంట్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారం భించే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పవి ఎన్జీవో వారు నిర్వహించిన ఈ వర్క్‌షాప్ విద్యా ర్థులకు తరువాతి దశలో ఉపాధి అవకాశాలు పొందడం ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## కాంగ్రెస్‌కు మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రాజీనామా

**లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిక**



మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :

కాంగ్రెస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తన అనుచరులతో కలసి మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. శుక్రవారం పార్టీకి రాజీనామా చేసిన లేఖను పార్టీ అధిష్టానంకు తెలియజేశారు. ఈసందర్బంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అధిష్టానం మేరకు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం జరిగిందన్నారు. యువ గళం పాదయాత్రలో భాగంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ సమక్షంలో అనుచరులతో కలసి ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు. నాలు గేళ్ళు గా వైకాపా పాలనలో కేవలం భూకబ్జాలకు నాయకులు పరిమితం అయ్యారన్నారు. మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తానని నారా లోకేష్ హామీ ఇవ్వడం పట్ల అభినందనలు వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు నాయకులు నాగూరువలి, ఇంతియాజ్, రెడ్డిసాహెబ్, షంషీర్, వేమయ్య, రెడ్డిబూ తమ పదవులకు రాజీనామా చేసి టిడిపిలో చేరారు.

## సేవా కార్యక్రమాలతో సమాజ సేవకు అంకితం

**లయన్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ భాస్కరాచారి**



మదనపల్లె, మార్చి 10 ప్రభాతవార్త :

సేవా కార్యక్రమాలతో సమాజసేవకు పునరింకితం అవుతామంటూ ఏబిసి ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేసి ప్రజలకు చేరువు అవుతానన్నారు. స్వర్ణకార సంఘం రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శిగా, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతి నిధిగా, అఖిలభారతీయ విశ్వకర్మ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులుగా నిత్యం ప్రజా సేవకు ముందుంటానన్నారు. స్వర్ణకారుల నైపుణ్య అభివృద్ధి కోసం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ సహకారాలు చేపడుతామన్నారు. ఏబిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువతకు విద్యాసామాగ్రిని ఉచితంగా అందిస్తామన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యసేవలు చేపడుతామన్నారు. ప్రజలతో పాటు పశువులకు, వైద్యచికిత్సలు ఉచితంగా అందిస్తామన్నారు.

## నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

**కడప మేయర్ కె.సురేష్‌బాబు**



కడప కార్పొరేషన్, మార్చి 10, ప్రభాతవార్త:

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని కడప మేయర్ కె.సురేష్‌బాబు అన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి సహకరిస్తున్నప్పటికీ సీబీఐ మాత్రం సరైన విధానాలు అనుసరించలేదన్నారు. విచారణలో ఆడియో, వీడియో రికార్డు చేయాలని అవినాష్‌రెడ్డి కోర్టు కేసు వేసినట్లు తెలిపారు. లాయర్‌ను కూడా అనుమతించాలని కోరడం జరిగిందన్నారు. మొదటి సారి విచారణ సమయంలో కూడా సీబీఐ అధికారులను ఈ విషయాలను కోరినట్లు తెలిపారు. కానీ వారు పట్టించుకోలేదన్నారు. టీడీపీ నేతలు వైఎస్.అవినాష్‌రెడ్డిపై లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నారని మండి పడ్డారు. వారి అనుకూల ప్రసార సాధనాలలో వ్యతిరేక ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కేవలం అవినాష్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని ఆరోపిస్తున్నారన్నారు. సీబీఐ వాస్తవాలు వెలికి తీయాలన్నారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు కల్లూరు నాగేంద్రరెడ్డి, నాయకులు కిరణ్, మల్లికార్జున, ఆర్వీ రమణ పాల్గొన్నారు.

## సస్పెండ్ అయిన విఆర్ఏకు 24 వరకు రిమాండ్



గాలివీడు.మార్చి10 ప్రభాతవార్త

అక్రమ వసూళ్ల పర్వంలో సస్పెండ్ అయిన తాత్కాలిక విఆర్ఏ రమణను ఈనెల 24 వరకు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెంకట శివకుమార్ తెలిపారు. బాధితులు, రెవెన్యూ అధికారులు పిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీస్‌లు నిందితుల్ని శుక్రవారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసులో పూర్తి విచారణ చేసి తదనంతరం తాత్కాలిక విఆర్ఏ 23 లక్షలు వసూళ్లు చేసినట్లుగా స్పష్టమవగా నిందితుని నుంచి 5లక్షల వసూలు చేశామన్నారు. ఇకపై ఇలాంటి అత్యాసలకు పోయి ఎవరినీ గుడ్డిగా నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు.

## పిఎండిఎస్ పద్ధతి ద్వారా రైతులు అధిక లాభాన్ని పొందవచ్చు



రామాపురం, మార్చి10 ప్రభాతవార్త

రైతులు ప్రీ మాన్సూన్ డ్రైసోయింగ్ పద్ధతి ద్వారా నిరంతర పంట అధిక దిగుబడిన లాభాలను పొందవచ్చని అడ్వైజరీ బోర్డు చైర్మన్ అయోధ్యపురం పెద్దిరెడ్డి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం అడ్వైజరీ బోర్డు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా అడ్వైజరీ బోర్డు చైర్మన్ అయోధ్యపురం పెద్ది రెడ్డి హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పలు రకాల విత్తనాలను 20 నుంచి 35 రకాలు విత్తనపు కిట్లుగా తయార చేసి రైతులందరికి పంచి పెట్టడం ద్వారా రైతులు వాటిని వినియోగించుకుని భూమిలో చల్లడం ద్వారా 365 రోజులు భూమిని పచ్చదనం ఉండడమే కాక ఆదాయాన్ని ఇచ్చే పలు రకాల పంటలను పండించుకుని రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునానరు. అగ్రికల్చర్ ఆఫీసర్ నాగమణి మాట్లాడుతూ రైతులకు అందరికి అందుబాటులో ఉచితంగా విత్తనపు కిట్లు అందజేయడం జరుగుతుందని వాటిని వినియోగించేయని రైతులు పిఎండిఎస్ ద్వారా అధిక లాభాన్ని పొందాలని ఆమె రైతులును కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, ఏవో నాగమణి, మండల మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ, మధుకర్, మండల యాంకర్ సూరం వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేద్దాం

**-మున్సిపల్ కమీషనర్ రాంబాబు**



రాయచోటి.మార్చి10 ప్రభాతవార్త

జిల్లాలో ఈనెల 14వ తేదీ నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేద్దామని రాయచోటి మున్సిపల్ కమీషనర్ రాంబాబు పేర్కొన్నారు. రాయచోటి మున్సిపల్ పరిధిలోని అధికారులు బృందం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమావేశమై అన్ని అంగన్‌వాడీ కేంద్రాలల్లో అన్ని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల్లో ఈనెల 14న నులిపురుగుల నిర్మూలన మందు బిళ్లలు అందుబాటులో ఉంటాయని, తల్లిదండ్రులువిధిగా పిల్లలకు మందు బిళ్లలు మింగించాలని అధికారులు సూచించారు. మండల విద్యాశాఖాధికారి రమాదేవి మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున అన్ని పాఠశాల యాజమాన్యాలు, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్‌లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రజలకు తెలియజేసి అందరూ మందు బిళ్లలు తీసుకునేలా చూడాలని సూచించారు. అనంతరం మందు బిళ్లలు పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఏఎన్‌ఎంలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ వసీమ్, డిఆర్ శివమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుగుణ, పలు పాఠశాలల సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## డిజిటల్ యుగంలో లింగ సమానత్వం




కడప, మార్చి 10 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం(మార్చి 8-11) వారోత్సవంలో భాగంగా, కడప నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్, ఉమెన్ ప్రొటెక్షన్ జెండర్ ఈక్విటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల సమావేశ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రచయిత, కవయిత్రి, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఇన్నోవేషన్ టెక్నాలజీ ఫర్ లింగ సమానత్వం అనే థీమ్ పై మహిళలు నేటి సమాజంలో సాధికారత, సాంకేతిక మార్పు, విద్య , ఉపాధిలో విస్తృతమైన ఆర్థిక సామాజిక అసమానతలపై విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తూ, అదేవిధంగా మహిళల చట్టాలు అమలులో లేకపోవడం మహిళల పురోగతికి ఆటంకాలు కలుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ ప్రధానాచార్యులు డాక్టర్ వీ.ఎస్.ఎస్ మూర్తి, హెచ్ అండ్ ఎస్ డిపార్ట్మెంట్ విభాగాధిపతురాలు డాక్టర్ శ్రీవాణి, ఈసీఈ విభాగాధిపతురాలు డాక్టర్ జి హేమలత ప్రోగ్రాం సమన్వయ కర్తలు డాక్టర్ జి రాధా, ఎస్. షర్మిల భాను, మహిళా సిబ్బంది విద్యార్థినిలు పాల్గొన్నారు.

## భక్తులు కోర్కెలు తీర్చే పాలేటమ్మ

**-కేశాపురం జాతర సందర్బంగా పాలేటమ్మ అమ్మవారిని దర్శించుకున్న టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



చిన్నమండెం.మార్చి10 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం మండలం కేశాపురం జాతర సందర్భంగా శుక్రవారం జాతర సందర్భంగా శుక్రవారం రాయచోటి నియోజకవర్గపు టిడిపి నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాలేటమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మండిపల్లి రాంప్రసాద్‌రెడి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలంతా అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలన్నారు. చిన్నరసుపల్లిలో చాందిని బండి ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం దేవలంపేటలోని మూగిరెడ్డెప్ప, టీచర్ రెడ్డెప్ప ఇచ్చిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ ఎంపిటిసి భాస్కర్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, భరత్‌కృష్ణయాదవ్, ఆనంద్, గుడిశివ, సర్వేయర్ శివ, పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**-ప్రతి మహిళా విద్యావంతురాలు కావాలి**

**-జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్**



రాయచోటి, మార్చి10 ప్రభాతవార్త

మహిళలు అన్ని రంగాలలో రాణించి ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గిరిష పిఎస్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సమాఖ్య వారి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆటల పోటీలలో గెలుపొందిన మహిళలకు జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించి ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ప్రతి రంగంలో ముందున్నారని ప్రతి మహిళా విద్యావంతురాలై ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ సమాజంలో మహిళలందరూ పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఈ పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో రాణించడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. మహిళలు ఏ సమస్య వచ్చిన భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌డిఏ జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో సమాఖ్య సభ్యులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించడం జరిగినది. అనంతరం స్పందన హాల్లో సమావేశం ఏర్పాటు చేసి డిఆర్‌డిఏ పిడి సత్యనారాయణ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మహిళా అధికారులను ఘనంగా సత్కరించి ఆటల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మైథిలి, జిల్లా నలుమూలల నుంచి డిఆర్‌డిఏ మహిళా సిబ్బంది, మండల సమాఖ్య లీడర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యం మన అందరి బాధ్యత

**డా.విజయ్‌కుమార్**



రామాపురం, మార్చి10 ప్రభాతవార్త

చిన్నారులు ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని రామాపురం మండల ప్రాధమిక ఆరోగ్య కేంద్రం డా.విజయ్‌కుమార్ అన్నారు. ఈనెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సవవేశంలో ఆయన మాట్లాడుతూ 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికి అల్బెన్డజోల్ 400 మి.గ్రా. మాత్రలు తప్పకుండా మింగించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలు, మండలంలోని అంగన్‌వాడీ టీచర్‌లు, స్కూల్ టీచర్‌లు, రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపల్ తో సమావేశమై అల్బెండజోల్ టాబ్లెట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో హైదర్‌వలి, మండల విద్యాశాఖాధికారి రామక్రిష్ణుడు, ఆరోగ్య సిబ్బంది, సిహెచ్‌వో